నారాయణగూడలో విద్యార్థులతో కలిసి నిరసన ర్యాలీలో ఎస్ఎఫ్ఐ నేతలు



# ఏడేళ్లుగా రూ.8300 కోట్ల బకాయిలు

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు
- రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్

**కాచిగూడ:** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ చెల్లించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం నారాయణగూడ చౌరస్తా నుంచి వైఎంసీఏ మీదుగా విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏడేళ్లుగా రూ.8300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఉన్నాయని అన్నారు. వాటిని విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఉపేక్షించమని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే సచివాలయం, ప్రజా భవన్‌ను లక్షలాది మంది విద్యార్థులతో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు దామర కిరణ్, లెనిన్ గువేరా, స్టాలిన్, నాగేందర్, ప్రశాంత్, చరణ్ శ్రీ, సహన, భగత్, శివ తదితరులు పాల్గొన్నారు.

# కాచిగూడ ఆర్టీసీ డిపోకు మూడో స్థానం

**కాచిగూడ:** దసరా స్పెషల్ ఆపరేషన్స్‌లో భాగంగా రిటర్న్ ట్రాఫిక్‌లో కాచిగూడ డిపో 97.33 ఈపీకే సాధించి రాష్ట్ర స్థాయిలో 3వ స్థానంలో నిలిచింది. యాజమాన్యం నిర్దేశించిన ఫెయిర్ పెయిడ్ అర్నింగ్స్ టార్గెట్ రూ.12.22 లక్షలు అధిగమించి రూ.13.44 లక్షలు సాధించినట్లు డీఎం రఘు తెలిపారు. మొత్తం రూ.29 లక్షల అర్నింగ్స్ సాధించామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో 3వ స్థానంలో కాచిగూడ డిపో నిలిచిన సందర్భంగా ఉద్యోగులతో కలిసి అధికారులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఎం) జగన్ పాల్గొని ఉద్యోగులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కె.శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజినీర్ వాసవీ పాల్గొన్నారు.



కాచిగూడ డిపోలో ఉద్యోగులతో కలిసి సంబరాలు జరుపుకుంటున్న అధికారులు

# నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం



ప్రమాణం స్వీకారం చేస్తున్న సివిల్ సప్లయ్ సర్కిల్-6 నూతన కార్యవర్గ సభ్యులు

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** సివిల్ సప్లయ్ హైదరాబాద్ సర్కిల్-6 అంబర్‌పేట డివిజన్ రేషన్ డీలర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం గురువారం రాంనగర్‌లోని ఎస్ఆర్‌టీ కమ్యూనిటీహాల్‌లో ప్రమాణస్వీకారం చేసింది. కమిటీ నూతన అధ్యక్షుడిగా బ్యారం కుమార్, ప్రధాన కార్యదర్శిగా వాడకట్టు రాజు, కోశాధికారిగా మహ్మద్ మెనుజమాన్, వర్కింగ్‌ప్రెసిడెంట్‌గా వి.మహేందర్‌రాజు, సలహాదారులుగా గౌరయ్య, ఎ.అప్పారావు, న్యాయ సలహాదారులుగా వనం రమేష్, ఉపాధ్యక్షులుగా ఎం. జనార్దన్, ప్రసాద్, తిరుపతి, ఎర్రం శ్రీనివాస్, మీడియా కార్యదర్శిగా కె. విజయానంద్, సంయుక్త కార్యదర్శిగా శ్రావణ్ కుమార్, ఎస్‌బిచారి, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.వేణు తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నాయకోటి రాజు, సంజీవరెడ్డి, జాతీయ అధ్యక్షుడు కాచం కృష్ణమూర్తి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వైకుంఠం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# హెబ్రోను ట్రస్టు సభ్యులు తప్పుడు ప్రచారం చేశారు

సొసైటీ అధికార ప్రతినిధి బ్రదర్ రాగి వీరాచారి

**చిక్కడపల్లి:** గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోను చర్చి ట్రస్టు సభ్యులు తనపై 34 కేసులు ఉన్నాయని తప్పుడు ప్రచారం చేశారని చర్చి సొసైటీ అధికార ప్రతినిధి బ్రదర్ రాగి వీరాచారి అన్నారు. గురువారం చిక్కడపల్లిలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరాచారి మాట్లాడారు. హైకోర్టులో స్టే ఇస్తూ తమకు న్యాయమైన తీర్పు ఇచ్చారని తెలిపారు. తనపై జరిగిన ఈ తప్పుడు ప్రచారాన్ని విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. ట్రస్టు వారు పెట్టిన 4కేసులు మాత్రమే ఉన్నట్లు పరిశీలించిన హైకోర్టు బుధవారం తనను అరెస్టు చేయొద్దని స్టే ఇచ్చారన్నారు. ఆగస్టు 31 తేదీన రాత్రి ట్రస్టుకు సంబంధించిన వ్యక్తులు, కొంత మంది కలసి హెబ్రోను చర్చిపై దాడి చేశారని చెప్పారు. ఎలక్ట్రికల్ యాంత్రాలతో గేట్ల తాళాలు గేట్ల తాళాలు కోసి, బగల గొట్టి అక్రమంగా లోనికి ప్రవేశించి దౌర్జన్యం చేశారని తెలిపారు. ట్రస్టు చెందిన వ్యక్తి ఆ రోజు హెబ్రోను చర్చి గోడపై నుంచి దూకడంలో చేయి వ్రేలికి దెబ్బ తగిలిందన్నారు. ఆ గాయన్ని చూపించి అక్రమంగా కేసు పెట్టారని వాపోయారు. ప్రభుత్వం, పోలీసులు గమనించి తమకు తగిన విధంగా న్యాయం చేయాలని కోరారు.



# ద్విచక్రవాహనంలో మంటలు

- అప్రమత్తమైన వాహనదారుడు
- తప్పిన ప్రమాదం

**కవాడిగూడ:** లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠం వద్ద ఓ ద్విచక్రవాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పల్సర్ వాహనం పూర్తిగా మంటల్లో దహనమయ్యింది. గురువారం ఉదయం 9గంటల ప్రాంతంలో ఈ సంఘటన దోమలగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఈ సంఘటనలో వాహనదారుడు అప్రమత్తమై పక్కకు నిలిపి వాహనం దిగిపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

- దోమలగూడ సీఐ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... విద్యానగర్‌కు చెందిన పుల్లెల వెంకటమహేశ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఎప్పటిలాగే విద్యానగర్ నుంచి గురువారం ఉదయం తన పల్సర్ 150సీసీ వాహనంపై బయల్దేరాడు. విద్యానగర్ మీదుగా వీఎస్‌టీ స్టీల్ బ్రిడ్జినుంచి లోయర్ ట్యాంక్‌బండ్ వైపు వెళ్తున్నాడు. ట్రాఫిక్ జామ్ కావడంతో నెమ్మదిగా వచ్చిన ఆయన రామకృష్ణ మఠం వద్దకు రాగానే తన వాహనంలోని వైరు నుంచి మంటలు రావడాన్ని గమనించాడు.
- వెంటనే తన రామకృష్ణ మఠం వద్ద నిలిపివేయడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి వాహనం పూర్తిగా దగ్ధమయ్యింది. సమాచారం అందుకున్న దోమలగూడ పోలీసులు, చుట్టపక్కల వారు మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దగ్ధమవుతున్న పల్సర్ వాహనం

# ఎంఎంటీఎస్‌లో మహిళ మృతదేహం లభ్యం

**కాచిగూడ:** ఎంఎంటీఎస్ రైల్లో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం... లింగంపల్లి-ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ల మధ్య ఎంఎంటీఎస్ రైల్లో ఓ గుర్తుతెలియని మహిళ (35) మృతదేహాన్ని గుర్తించి ఫలక్‌నుమా రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫారం-3 వద్ద దింపారు. రైల్వే పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# వాల్మీకి రచనలు స్ఫూర్తిదాయకం

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** వాల్మీకి రచనలు సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అంబేడ్కర్ కళాశాలల డైరెక్టర్ విష్ణుప్రియ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో గురువారం వాల్మీకి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం విష్ణుప్రియ మాట్లాడుతూ... వాల్మీకి మహర్షి సంస్కృతంలో రాసిన అనేక రచనలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భాషల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పట్టుదలతో ఆయన అనేక రచనలు చేసి భావితరాలకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. విద్యార్థి దశలోనే పట్టుదలతో శ్రమించి ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మట్టా శేఖర్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**బాగ్‌లింగంపల్లిలోని సూర్యానగర్‌లో...**

బాగ్‌లింగంపల్లిలోని సూర్యానగర్‌లో శ్రీ మహర్షి వాల్మీకి ప్రకట్ ఉత్సవ్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీ మహర్షి చిత్రపటం వద్ద పూజలు చేశారు. అనంతరం బస్తీలలో అల్పాహారం, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రకట్ ఉత్సవ్ అధ్యక్షుడు జె. సురేందర్ మాట్లాడుతూ... వాల్మీకి మహర్షి రచనల వల్ల ఎంతో మందికి జ్ఞానోదయం కలిగిందన్నారు. ఆయన రచనలు నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు అర్జున్, పప్పు, సుభాష్, అనిల్, సురేందర్, నెస్సీ, శివ, పవన్, బిట్టు, లఖన్ తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి జయంతి ఉత్సవంలో మాట్లాడుతున్న డైరెక్టర్ విష్ణుప్రియ



సూర్యానగర్‌లో జరిగిన వాల్మీకి జయంతి వేడుకలో వాల్మీకి ప్రకట్ ఉత్సవ్ సభ్యులు

## 20న హరిణి వనస్థలిలో పద్మశాలి దసరా మేళా

**కాచిగూడ:** పద్మశాలి సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన ఆటోనగర్‌లోని హరిణి వనస్థలి (డీర్‌పార్క్) అనన్య ఎకో పార్క్ ప్రాంగణంలో పద్మశాలి దసరా మేళా నిర్వహిస్తున్నట్లు అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల తెలిపారు. గురువారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. పద్మశాలి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దసరా మేళాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుంటక రూపా, గ్రేటర్ అధ్యక్షురాలు పొరండ్ల శారద, ఎల్‌బీనగర్ అధ్యక్షురాలు సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు మాజీ సీఎం టి.అంజయ్య వర్ధంతి సభ

**కవాడిగూడ:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత టి.అంజయ్య వర్ధంతి వేడుకలు ట్యాంక్‌బండ్‌లోని లుమినీ పార్కులో నిర్వహిస్తున్నట్లు అంజయ్య కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అభిషేక్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ పెద్దలు, అంజయ్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## టీసీల సమర్పణకు నెల రోజుల గడువు ఇవ్వండి

**ఉస్మానియా యూనివర్సిటీ:** పీజీ కోర్సుల్లో సీటు సాధించిన విద్యార్థులకు ఒరిజినల్ టీసీ (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్) సమర్పణకు నెల రోజుల గడువు ఇవ్వాలని ఏబీవీపీవర్సిటీల స్టేట్ కన్వీనర్ జీవన్ డిమాండ్ చేశారు. ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీ బంద్ వల్ల టీసీల జారీలో జాప్యం ఏర్పడుతోందన్నారు. మూడేళ్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కానందున కాలేజీల యజమానులు టీసీలు ఇవ్వడం లేదన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యార్థులు కాలేజీ ఫీజులు చెల్లించి సకాలంలో టీసీలు సమర్పించే అవకాశం లేదన్నారు. కౌన్సెలింగ్ సమయంలో టీసీలు లేకుంటే పీజీ అడ్మిషన్లు రద్దు చేయవద్దని కోరారు.

## వైద్యసాయానికి సిద్ధంగా ఉన్నాం

ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

**సికింద్రాబాద్:** నిరుపేదలకు వైద్య సాయాన్ని అందించేందుకు నిరంతరం సిద్ధంగా ఉంటామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ హామీ ఇచ్చారు. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాస్‌నగర్‌కు చెందిన స్టాలిన్, వారాసిగూడకు చెందిన బీ పాషా అనారోగ్యం బారిన పడి వైద్య సహాయం కోసం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆశ్రయించారు. పద్మారావు గౌడ్ చొరవ తీసుకొని వారికి వైద్య ఖర్చుల నిమిత్తం చెరో రూ.2 లక్షల చొప్పున సీఎం సహాయనిధి నుంచి ఎల్‌ఓసీ పత్రాలను తెప్పించి గురువారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఆరోగ్య, సంక్షేమ పథకాలు అందించడం కోసం తమ కార్యాలయం మొదటి నుంచి బాసటగా నిలుస్తుందని తెలిపారు. పదేళ్ల కాలంలో రికార్డు సంఖ్యలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పేదలకు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నీల ప్రభాకర్, జహంగీర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన సమస్యలను పరిష్కరించాలి

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**అంబర్‌పేట:** అంబర్‌పేట డివిజన్‌లో అస్తవ్యస్తంగా ఉన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. అంబర్‌పేట డివిజన్‌లో గురువారం కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, జీహెచ్ఎంసీ అధికారులు, పోలీస్ కమాండెంట్‌తో కలిసి పరిశీలించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న మోయిన్ చెరువు నాలా అంబర్‌పేట డివిజన్‌లోని బాపునగర్, చెన్నారెడ్డినగర్, పటేల్‌నగర్, ప్రేమ్‌నగర్, ప్రాంతాల మీదుగా ప్రవహించి మూసీలో కలుస్తుంది. నాలా ప్రవహించే ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా ఉందని పూర్తి స్థాయి పూడికతీత, విస్తారణ లేకపోవడంతో సమీపంలో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అసంపూర్ణంగా చేపట్టే పనులతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారుల దృష్టికి ఎమ్మెల్యే తీసుకువచ్చారు. అలాగే సీపీఎల్ ప్రాంతం నుంచి వరదనీరు ఈనాలా కలవడంతో సమస్య మరింత తీవ్రం అవుతుందన్నారు. సమస్యలన్నింటిని గుర్తించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకువాలని జీహెచ్ఎంసీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ మారుతీదివాకర్, సీపీఎల్ కమాండెంట్ వెంకటేశ్వరరావు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



అంబర్‌పేట పటేల్‌నగర్ చౌరస్తాలో సీపీఎల్ నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

# శంకరమఠంలో 'చండీ హోమం

**నల్లకుంట:** పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం నల్లకుంట శంకరమఠం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా ముందుగా మఠం ప్రాంగణంలోని శక్తి గణపతికి ఆదిపూజలు చేశారు. చంద్రమౌళీశ్వర స్వామి, శారదా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మఠం ప్రాంగణంలో గల యాగశాలలో పండితుడు శ్రీనివాసశర్మ మంత్రోచ్చరణల నడుమ 'చండీ హోమం'చేశారు. ఈ సందర్భంగా నవధాన్యాలు, అమ్మవారికి సమర్పించిన వస్త్రాలు, పసుపు కుంకుమ, సుగంధ ద్రవ్యాలు హోమంలో వేసి ఆవు నెయ్యితో పూర్ణాహుతి కావించారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాద, భోజన వితరణ జరిగింది. ఈ హోమంలో మఠం నల్లకుంట బ్రాంచ్ హెడ్ కృష్ణారావు పాల్గొన్నారు.



చండీ హోమం నిర్వహిస్తున్న వేదపండితుడు శ్రీనివాసశర్మ

## సైబర్ సెక్యూరిటీపై అవగాహన

**పద్మారావునగర్:** సికింద్రాబాద్ కవాడిగూడ ప్రధాన రహదారిలోని పవర్‌గ్రిడ్ సదరన్ రీజియన్ -1 కార్యాలయంలో గురువారం సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ సైబర్ సెక్యూరిటీ, విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పవర్‌గ్రిడ్ సదరన్ రీజియన్-1 చీఫ్ జనరల్ మేనేజర్ అఖిలేష్ పాఠక్, సీజీఎం ఎస్ఎంవీ నానాజీ(ఏఎం), సీజీఎం వెంకట ఎస్వీ(ఎఫ్అండ్ఏ), సీనియర్ జీఎం పీసీఎస్ రెడ్డి(విజిలెన్స్)లతోపాటు పెద్ద ఎత్తున ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఎస్.ఐ.లు పకీజా, భవానీ, శ్రీకాంత్, సైబర్ క్రైమ్ టెక్నికల్ అనలిస్ట్ శ్రీకాంత్ మాట్లాడుతూ చాలామంది అవగాహనారాహిత్యం, తొందరపాటు, అమాయకత్వంతో సైబర్ నేరస్తులకు చిక్కిపోతూ తమ డబ్బులను పోగొట్టుకుంటున్నారని చెప్పారు. డిజిటల్ ఆర్థిక లావాదేవీల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిజిటల్‌పరంగా మోసగాళ్ల భారీ నుంచి ఎలా రక్షించుకోవాలనే విషయాలపై పోలీసులు అవగాహన కల్పించారు.



# డిపాజిట్లు లేకుండా మెస్ సదుపాయం కల్పించండి

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూలో పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు డిపాజిట్లు లేకుండా భోజన సదుపాయం కల్పించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు అలివేలి రాజు మాట్లాడుతూ డిపాజిట్ల పేరుతో లక్షల రూపాయలను వసూలు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, రీయింబర్‌మెంట్ నిధులు విడుదల కానందున హాస్టల్ ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

# 'పాత కక్షలు.. ద్విచక్ర వాహనాలకు నిప్పపెట్టారు'

**అంబర్‌పేట:** పాత కక్షలతో ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన ద్విచక్ర వాహనాలను తగులబెట్టారు. అర్ధరాత్రి ఇంట్లో పార్క్ చేసిన వాహనాలపై పెట్రోల్ చల్లి నిప్పు పెట్టడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్ హనుమాన్ ఆలయం సమీపంలో నివాసిస్తున్న అరుణ్, బాలరాజులు వారి ద్విచక్ర వాహనాలను ఇంట్లో పార్క్ చేసి నిద్రిస్తున్నారు.

- ఇదే ప్రాంతానికి చెందిన రాజేశ్, అభిషేక్, జాకబ్‌లు పాత కక్షలతో అర్ధరాత్రి అరుణ్, బాలరాజు నివాసిస్తున్న ఇంటికి వెళ్లారు. వారి వాహనాలపై పెట్రోల్ చల్లి నిప్పు పెట్టారు. వాహనాలు మంటల్లో కాలతుండడంతో ఇంట్లో నిద్రిస్తున్న వారితో పాటు చూట్టుపక్కల వారు గమనించారు. అంతా కలిసి దగ్ధమవుతున్న వాహనాలను నీళ్లతో మంటలను ఆర్పివేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.
- బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. పరిసరాల ప్రాంతాల్లో ఉన్న సీసీటీవీ కెమెరాలను పరిశీలించి సంఘటనకు పాల్పడ్డ రాజేశ్, అభిషేక్, జాకబ్‌లను పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



దగ్ధమైన ద్విచక్ర వాహనాలు

## సీఎం రేవంత్‌రెడ్డి కోర్టుకు హాజరుకాకపోయినా.. కోర్టు స్పందించకపోవడం సరైందికాదు

**కాచిగూడ:** ఓటుకు నోటు కేసులో ఏ-1 ముద్దాయిగా ఉన్న తెలంగాణ సీఎం ఎ.రేవంత్‌రెడ్డి ఆరేళ్లుగా కోర్టుకు హాజరుకాకపోయినా... నాంపల్లిలోని ఈడీ కోర్టు స్పందించకపోవడం సరైందికాదని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. గురువారం నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ముద్దాయిగా ఉన్న సీఎం కోర్టుకు గౌరవం ఇచ్చి కోర్టు వాయిదాకు హాజరుకావాలన్నారు. కేసు విచారణ వేగవంతానికి ముందుకు రావాలని కోరారు. సీఎంగా ఉన్న ముద్దాయిని ఈడీ కోర్టుకు రప్పించలేక పోవడం కోర్టు చేతగాని తనంగా ప్రజలు భావిస్తారని అన్నారు. ఇదే ఒక పేదవాడైతే విచారణ పూర్తి చేసి శిక్షలు కూడా వేయడానికి ఈ కోర్టులు ముందుంటాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మద్దెల ప్రవీణ్ కుమార్, చిప్పరి సుబ్బారావు, ఇటికాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవే మా ధ్యేయం



అన్నదానం చేస్తున్న వైశ్యం సంఘం ప్రతినిధులు

**చిక్కడపల్లి:** చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం చిక్కడపల్లిలోని నగర గ్రంథాలయం సమీపంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ సంఘం ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమ ధ్యేయమని సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాలకుమార్, టి.రవీందర్‌గుప్తా, రవిశంకర్‌గుప్తా, ఆర్.బాల్‌చందర్, శ్రీనివాస్, ధనలక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలో సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వాలి



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్ వీఎస్సార్

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** బీఆర్ఎస్ పార్టీలో సీనియర్ నాయకులను గుర్తించి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కోరినట్లు మాజీ కార్పొరేటర్, వీఎస్‌టీ యూనియన్ అధ్యక్షుడు వి. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం కేటీఆర్‌ను కలిసి నియోజకవర్గంలోని సమస్యలను, ఇటీవల డివిజన్ ప్రెసిడెంట్ నియామకం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. పార్టీలో సుదీర్ఘంగా పనిచేస్తున్నవారికి పదవులు ఇచ్చి గుర్తించాలని కోరినట్లు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో నాయకులు కాల్వ గోపి, అజయ్ ముదిరాజ్, జోగేందర్, సిరిగిరి శ్యామ్, సిరిగిరి కిరణ్, ఆటో శ్రీను, బాలరాజు గౌడ్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## సెక్షన్ మేనేజర్‌ను అభినందించిన ఎండీ



జలమండలి సెక్షన్ మేనేజర్‌ను అభినందిస్తున్న ఎండీ అశోక్‌రెడ్డి

**సాక్షి,సిటీబ్యూరో:** సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న క్లిష్టమైన సాంకేతిక సమస్యలను సైతం పరిష్కరించేందుకు కృషి చేస్తున్న బాగ్‌లింగంపల్లి సెక్షన్ మేనేజర్ భావనను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అభినందించారు. గురువారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కాచిగూడ, బాగ్‌లింగంపల్లి ప్రాంతాలలో మురుగు లైన్ డీసిల్టింగ్ పరిశీలించారు. పనితీరుతో శభాష్ అనిపించుకున్న భావనను వర్క్ సైట్‌లో సత్కరించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు వినతి



వినతి పత్రం అందచేస్తున్న లింగంగౌడ్

**ఉస్మానియా యూనివర్సిటీ:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదలయ్యేవిధంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌కు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వాలు మారినా పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఉపకార వేతనాలు, ట్యూషన్ ఫీజు నిధులను విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. కోర్సులు పూర్తి చేసినా ఫీజులు చెల్లించనందున కాలేజీ యజమానులు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంబీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బడేసాబ్, నాయకులు రవీందర్, నరేష్, ప్రియ, సునీత, దివ్య, జ్యోతి, మమత, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## 29 జీవోను రద్దు చేయాలి

**ఉస్మానియా యూనివర్సిటీ:** జీవో నంబర్ 29 రద్దు చేసి గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలని సాతిండియా జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థుల ఆందోళనకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. జీవో నంబర్ 29 వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతోందన్నారు. జీవో నంబర్ 55 ప్రకారం గ్రూప్-1 మెయిన్స్ నిర్వహించాలని కోరారు.